"స్వామీజీ ఇప్పుడు చెరుకురసం తీసే బండీ పెట్టుకున్నాడట నాగార్జునసాగర్ దగ్గర"

నటాషా నవ్వాపుకుంది.

"ఇందులో చాలా భాగం కథ కదూ?"

"ఆత్మ పరమాత్మ సంగతి వదిలేస్తే మిగతాది ఫాక్ట్."

"నువ్వెందుకిలా తయారయ్యావ్?"

"నా కయితే ఒకే ఒక్క కారణం కనబడుతోంది"

"ఏమిటది?"

"మా ఫాదరు మదరు పెళ్ళి చేసుకునేసరికి ఆలస్యమయిందట మా పెదనాన్న చెప్తూండగా విన్నాను."

ఎనౌన్స్‌మెంట్ వినబడసాగింది.

నటాషా టైమ్ చూసుకుంది.

"సురేష్ అయ్ వాంట్ టు టెల్ యూ సమ్‌థింగ్"

"ఎస్!"

"రాన్రాను క్యాబరే డాన్సులమీద పోలీసుల గొడవ ఎక్కువయిపోతోంది. అందుకని మారేజ్ చేసుకుని సెటిలవ్వాలని ఆలోచిస్తున్నాను. బహుశా యిదే నా లాస్ట్ ట్రిప్ కావచ్చు."

"అంటే........"

"ఎస్! సేన్ గుప్తా అనీ దుబాయ్‌నుంచి చాలా డబ్బు తెచ్చాడు. బాంబేలో నాకు ఫ్లాట్ కొనిస్తానన్నాడు. పెళ్ళికి ఒప్పుకున్నాను."

ఆమె మళ్ళీ కనిపించదనేసరికి సురేష్ మనసంతా అదోలా అయిపోయింది.

"అయ్ మిస్ యూ నటాషా " దిగులుగా అన్నాడతను.

"నాట్ ఫరెవర్" నవ్వుతూ అని వెళ్ళిపోయిందామె.

ఇంటికి చేరుకునేసరికి తులసి వంటింట్లో టీ తయారుచేస్తోంది. ఆమె వెనుకే పూర్తిగా ఆమెను స్పర్శిస్తూ నిలబడ్డాడతను.

"ఎనీ లక్?" అడిగిందామె.

"రేపో చాన్స్ వుంది"

"నా దగ్గర డబ్బంతా అయిపోయింది " కాజువల్‌గా చెప్పిందామె.

సురేష్‌లో బ్లడ్ ప్రెజర్ పెరిగిపోతోంది.

మొదటిసారి యిలాంటి పరిస్థితి రావటం.

ఇందుకు బాధ్యతంతా హఠాత్తుగా తనమీద పడిపోయింది.

ఇద్దరు చెరికొంచెం తాగసాగారు. తలుపు కొంచెం తోసి అనుమానంగా లోపలకు చూసింది గంగాభవాని. తరువాత ధైర్యంగా లోపలికొచ్చింది.

"ఇంట్లో చేరిన ఇంత కాలానికి యిలా విడి విడిగా చూశాను......."

"అది మీ ఇంటితప్పు. ఇంత యిరుకిళ్ళు కట్టిస్తే ఎవరు మాత్రమేం చేస్తారు?" అన్నాడు సురేష్ .

"మీరు యిల్లు ఖాళీ చేయాలని చెప్పటానికొచ్చాను......" అందామె.

ఇద్దరూ ఉలిక్కిపడ్డారు.

"మేమిద్దరం కూడా మీ యింట్లోనే వుండటానికి మాకేం అభ్యంతరం లేదుగాని లైట్లు పోయినప్పుడు మాత్రం మీకేమయినా యిబ్బంది కలుగుతుందేమోనని...."

ఆమె ముఖంలో కోపం పొడుచుకొస్తోంది.

"సీరియస్‌గానే చెపుతున్నాను"

"ఎందుకని?" అడిగింది తులసి.

"మీరన్నీ అబద్ధాలు చెప్పారు. మీకు పెళ్ళి అవలేదని కమల చెప్పింది"

"తేడా ఆమెకెలా తెలిసింది. తెలిస్తే తులసికి తెలియాలి"

"తులసి మెడలో మంగళసూత్రం లేదు"

"అదా!" నవ్వాడు సురేష్ "హా ... హా.... అదా! మేము క్రిస్టియానిటీ తీసుకున్నాం"

ఆమె అదిరిపడింది.

"అంతా అబద్ధం. మీరెప్పుడూ చర్చికి వెళ్లలేదు"

"తప్పుదంటే రేపటి వారం వెళ్తాం. బైదిబై మీరు కూడా వస్తారా? పాపాలన్నీ నశించిపోతాయ్"

"రేపు ఫస్ట్‌కి ఖాళీ చేసేయాలి" గంగాభవాని వెళ్ళిపోయింది.

అతను మంచం మీద కూర్చుని తులసిని కౌగిట్లోకి లాక్కున్నాడు.

ఆమె ముఖంలో అదివరకటి ఉత్సాహం ఆనందం లేవు.

"అయామ్ సారీ డియర్!" అన్నాడు ఆమె నాలుకమీద ముద్దుపెట్టుకుంటూ.

ఆమె స్పర్శ నిలువునా బరువుగా , మెత్తగా కాలుస్తోంది

అతన్ని వెనుకకు తోస్తూ "నువ్వెందుకు సారీ చెప్తావ్?" అంది.

ఆమె కళ్ళ నిండుగా నీరు.

చెళ్ళున ముఖాన చరచినట్లయింది డార్క్‌డెవిల్ డైలాగ్ "ఒరేయ్! ఎప్పటికి ఆ పిల్ల కన్నీరు పెట్టకుండా చూచుకో."

"తులసీ! ప్లీజ్ నీతో కన్నీరు పెట్టించటానిక్కాదు నేను నిన్ను ప్రేమించింది.

నువ్వెప్పుడూ నవ్వుతూండాలనీ, నీ పెదాలమీద చిరునవ్వు చెరగకూడదనీ , నిన్ను నా దాన్ని చేసుకున్నాను. ప్లీజ్ డోంట్ డిస్‌హార్టెన్ మీ"

అతని గుండెల మీద తన్మయత్వంతో పడుకుండిపోయింది తులసి .

"నీకు గుర్తుందా తులసీ ! మనం సంతోష్‌లో సినిమాకెళ్ళినప్పుడు మధ్యలో పాట మొదలయి నేను సిగరెట్ వెలిగించుకుందామని బయటికెళ్ళబోతుంటే వెనుకనుంచి ఎవరో అరిచారు"

"ఏయ్! కింగ్‌సైజ్ కూర్చో!" అని.

తులసికి నవ్వాగలేదు.

"అవును" అంది గుర్తు తెచ్చుకుని తృళ్ళినవ్వుతూ.

"వెల్! ఇవాళ ఓ ప్యూన్ ఉద్యోగం కోసం వెళితే అతనేమన్నాడో తెలుసా? ఓవర్ క్వాలిఫైడ్ సారీ" అన్నాడు. తులసి నవ్వటం ఆపేసింది.

"ఓవర్ సైజ్ , ఓవర్ క్వాలిఫికేషన్ , ఓవర్ సెక్స్ , ఓవర్ ఇంటలిజెన్స్" విసుగ్గా అన్నాడతను.

"ప్యూన్ ఇంటవ్యూ కెళ్ళావా?" జాలిగా అడిగిందామె.

"సమ్‌థింగ్ ఈజ్ బెటర్ దేన్ నథింగ్."

సురేష్ జేబులోనుంచి యాభయ్ రూపాయల నోటు తీసి ఆమె కిచ్చాడు.

"ఎక్కడిది?" అడిగింది తులసి ఆశ్చర్యంగా.

"మా ఫ్రెండ్ ఒకతను రోడ్డుమీద కనిపించి టి.వి స్టేషన్‌కి లాక్కెళ్ళాడు. వాళ్ళ డ్రామాలో ఓ కారెక్టర్ తక్కువయాడట. వాడి ప్లేస్‌లో డైలాగ్స్ చదవమన్నారు. చదివాను . వందరూపాయల చెక్ ఇచ్చి యాభయ్ కట్ చేసుకున్నారు."

"అదేమిటి?"

"ఏభయ్ ఆ డ్రామా సెక్షన్ ప్రొడ్యూసర్‌కి లంచం. వెల్! యాభయ్ రూపాయలు ప్రెసిడెంట్ ఆఫ్ ఇండియానుంచి సంపాదించానివాళ. కానీ అక్కడ కూడా అదే రిమార్క్ ఓవర్ యాక్షన్"

తులసికి మళ్ళీ నవ్వొచ్చేసింది. మర్నాడు ఇంట్లోనుంచి బయటికొస్తోంటే పాదుల దగ్గర కూర్చున్న గంగాభవాని
ముఖం మాడ్చుకుని అవతలివేపుకి తిరిగింది.

"నా యాభయ్ రూపాయల సంగతేమిటి?"

"మీ ఋణం వుంచుకోనని అదివరకే చెప్పాను."

"అయితే విషయం ఏమిటీ?" అదిరిపడుతూ అడిగింది.

"అదే తులసి లేనప్పుడు మనం మా ఇంట్లో"

"అబద్ధాలు చెపితే మర్యాదగా వుండదు" అంది కోపంగా.

"సరే అయితే సాయంత్రం వస్తాను రడీగా వుండండి"

"సాయంత్రం యిస్తారా?"

"ఇస్తానుగానీ కాష్ రూపంలో కాదు కైండ్"

ఆమె రుసరుసలాడుతూ యింట్లో వెళ్ళిపోయింది.

హోటల్‌కి చేరుకునేసరికి రాజ్యలక్ష్మి తుది మెరుగులు దిద్దుకుంటూంది అద్దం ముందు కూర్చుని.

"ఓ! యూ హావ్ కమ్!" అంది అతనివేపు చూసి.

సురేష్ మంచం మీద కూర్చున్నాడు.

"సహదేవ్తో మాట్లాడాను."

"నకులుడు, సహదేవుడు ఎవరయినా ఫర్లేదు.....ఏమన్నాడో చెప్పండి?"

"మిమ్మల్ని తీసుకురమ్మన్నారు."

"నన్ను చూసి సారీ! కింగ్‌సైజ్ అనడుకదా?"

ఆమె నవ్వేసింది

"నా రికమండేషనుంటే ఎవరూ అనలేరు"

"థాంక్యూ గోల్డ్! మీ అద్భుతమైన రికమండేషన్ పవర్ గురించి నా మనవళ్లకు ముని మనవలకూ వాళ్ళు భోరున ఏడ్చేవరకూ కథలు చెపుతాను".

ఇద్దరూ ఆటో ఎక్కారు.

"ముందే చెప్తున్నాను. ఉద్యోగం దొరికేవరకూ నా భారమంతా మీమీదే వుంటుంది ఈ ఆటో చార్జితో సహా!"

"నా బాకీ ఎలా వసూలు చేసుకోవాలో నాకు బాగా తెలుసులెండి" నవ్వుతూ అందామె.

ఆటో బంజారాహిల్స్ మొదట్లోనే వున్న ఒక పెద్ద హోటల్ ముందాగింది,

వెనుక వైపున లాన్స్‌లో చాలామంది కుర్చీలో కూర్చుని వున్నారు.

పెద్ద గొడుగులా వున్న షెడ్ కిందకు నడిచింది రాజ్యలక్ష్మి . అప్పటికే టేబుల్‌ముందు ఓ వ్యక్తి కూర్చుని సిగరెట్ తాగుతున్నాడు. కాఫీ కలర్ ప్యాంటూ,
తెల్ల షర్టూ వేసుకున్నాడతను. గాలికి ఎగిరిపోయేలా సన్నగా వున్నాడు.

"హలో" అంది రాజ్యలక్ష్మి.

"హలో బేబీ!" అన్నాడతను. అతని ముఖంలో చిరునవ్వు కనిపించలేదు. అసలా డార్క్ కూలింగ్ గ్లాసెస్ వెనకాల అతని కళ్ళలో ఏ భావం వుందో తెలీటం లేదు.

“మీట్ మిస్టర్ సురేష్ !” అంటూ కుర్చీలో కూర్చుందామె.

సహదేవ్ ముందుకి వంగి అతనితో కరచాలనం చేశాడు. “ప్లీజ్డ్ టు సీయూ మిస్టర్ సురేష్”

సురేష్ కూడా కుర్చీలో కూర్చున్నాడు.

“సురేష్‌కి జాబ్ చాలా అవసరం సహదేవ్. హి ఈజ్ డెస్పరేట్” చెప్పింది రాజ్యలక్ష్మి.

“ఆ విషయం తెలిసిపోతోంది” అన్నాడు సహదేవ్ నవ్వుతూ.

అప్పుడు గమనించాడు సురేష్ .....అతని ముఖం నవ్వుతూంటే పరమ భయంకరంగా కన్పించింది. చాలా అనీజీగా ఫీలయ్యాడు సురేష్.

బేరర్‌ని పిలిచి ముగ్గురికి కూల్ డ్రింక్స్ ఆర్డర్ చేశాడు సహదేవ్. చుట్టూ ఓసారి చూశాడు సురేష్ . అందమైన అమ్మాయిలు ముగ్గురు ఐస్‌క్రీం తింటున్నారు ఓపక్క. మరోవైపు సుమారు ముప్ఫయ్ సంవత్సరాల స్త్రీ ఇరవై ఏళ్ళ కుర్రాడి చేతులు తన చేతుల్లోకి తీసుకుని రహస్యంగా మాట్లాడుతోంది.

ఇద్దరు ఫారినర్స్ ఒక ఇండియన్ యువతిని మధ్య కూర్చోబెట్టుకుని ఆమె చెప్పే మాటలు ఆసక్తిగా వింటున్నారు.

బేరర్ కూల్‌డ్రింక్స్ తెచ్చాడు.

“వాటీజ్ యువర్ క్వాలిఫికేషన్ మిస్టర్ సురేష్ ?” అడిగాడు సహదేవ్ కూల్ డ్రింక్ వైపు చూస్తూ.

“మీరెంతవరకూ కావాలంటే అంతవరకే”

“పోస్ట్‌గ్రాడ్యుయేషన్?”

“అది ఓవర్ క్వాలిఫికేష్ కాదనుకుంటే!”

“దటీజ్ నైస్!”

“నేనింక వెళ్ళవచ్చా?” అడిగింది రాజ్యలక్ష్మి.

“థాంక్యూ అయ్ విల్ గివే రింగ్”

“వెళ్తాను సురేష్, బెస్టాఫ్ లక్”

“థాంక్స్!”

రాజ్యలక్ష్మి వెళ్ళిపోయింది.

“వెల్ మీ కెంత జీతం కావాలి మిస్టర్ సురేష్ ?” అడిగాడతను.

“మీరెంత యివ్వగలిగితే అంత”

“సపోజ్ నేను మీకు పది లక్షలిస్తాననుకోండి”

సురేష్ త్రుళ్ళిపడ్డాడు కానీ అంతలోనే సర్దుకున్నాడు.

“మెంటల్ క్లినిక్ లో చెకప్ చేయించుకుంటాను.”

అతను సురేష్ మాటలు వినిపించుకోలేదు.

“నీకో జాబ్ ఇస్తాము సురేష్. జాబ్ చేసినన్ని రోజులూ నువ్వు మా ఆధీనంలో వుంటావు. నీ మీద సర్వహక్కులూ మాకే వుంటాయి. మీ వాళ్లెవర్నీ మీరు కలుసుకోడానికి, మాట్లాడడానికి వీల్లేదు. మాతో పూర్తిగా సహకరించాలి! ఈ షరతులన్నిటికి వప్పుకుంటే......” కొంచెం ఆగాడు అతను “నీకు పది లక్షల రూపాయలు యిస్తాము”

సురేష్ లో చలనం కలిగింది.

“అసాధ్యం అది. పది లక్షలా? ఎవర్ని ఫూల్ చేయటానికి ? లక్ష అంటే వందరూపాయలు అని అర్థమా?” అతని కళ్ళజోడు వైపు మరోసారి చూశాడు సురేష్.

ఎందుకో అతనివంక చూస్తుంటే ఆందోళన కలుగుతోంది......ఇందులో ఏమీ మోసం లేదు కదా! ఏదయినా సమస్యలో చిక్కుబడం కదా!